క్లుప్తంగా

13న హనుమత్ వ్రతం

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయ క్షేత్ర పాలకుడు పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం హనుమత్ వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ పూజలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

గీతంలో 'పీఎం శ్రీ' నిర్వహణ

కొమ్మాది: కేంద్ర ప్రభుత్వం పాఠశాలల విద్యార్థుల్లో సైన్స్ పట్ల అవగాహన పెంపొందించడానికి నిర్దేశించిన ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) కార్యక్రమాన్ని మంగళవారం గీతంలో నిర్వహించారు. శ్రీకాకుళం నుంచి జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థులు, అధ్యాపకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. గీతంలో అధునాతన పరిశోధన శాలలను, క్యాన్సర్ బయాలజీ ప్రయోగశాలను విద్యార్థులు సందర్శించారు. గీతం డీన్ ప్రొ. కేఎస్ కృష్ణ విద్యార్థులకు ప్రయోగశాలల పనితీరును వివరించారు.

పాఠశాలకు బీరువా, ప్రింటర్ అందజేత



స్టడీ మెటీరియల్ అందిస్తున్న దాతలు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ పరిధి వాడపాలెంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దేవీ సీ ఫుడ్స్ అధినేత బ్రహ్మానందం బీరువా, ప్రింటర్, క్రీడా సామగ్రిని మంగళవారం అందజేశారు. ఇక్కడ చదువుతున్న విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, స్టడీ మెటీరియల్ అందించారు. స్థానిక నాయకులు చెన్నా దాస్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పు కంటైనర్ బోల్తా

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు సాక్షి ప్రెస్–హరిత రోడ్డులో మంగళవారం అయోడైజ్డ్ సాల్ట్ ప్యాకెట్ల లోడ్‌తో వెళ్తున్న భారీ కంటైనర్ బోల్తా పడింది. వేకువజాము సమయంలో హరిత మాస్టర్ ప్లాన్ రోడ్డు నుంచి సాక్షి ప్రెస్ వైపు వెళ్తున్న కంటైనర్ ఎదురుగా వస్తున్న కారుకు తోవ ఇచ్చే క్రమంలో, పక్కకు ఒరిగి బోల్తా పడింది. ఈ రోడ్డు నిర్మాణ సమయంలో అంచులను సరిగ్గా పూడ్చకపోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు.

శాంతియుత జీవనానికి మానవ హక్కులు దోహదం

తగరపువలస: శాంతియుత జీవనానికి మానవ హక్కులు దోహదపడతాయని చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి అన్నారు. మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. చరిత్ర అధ్యాపకుడు ఎం.నాగరాజు తదితరులు మాట్లాడారు.

- మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా జాతీయస్థాయి ప్రతినిధులు బి.గోపీనాయక్, ఓరగంటి సుబ్బారావు పిలుపు మేరకు కమిటీ డైరెక్టర్ భాగం సుధాకర్, కె.రాజ్‌కుమార్, దొడ్డి ప్రసాద్ సంగివలసలో 180 మంది అన్నార్తులకు ఆహార ప్యాకెట్లు అందించారు.

మతం దేవుడిని అన్వేషించడంలో ఒక భాగం



క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న జాన్ వెస్లీ

మధురవాడ: మతం అనేది దేవుడిని అన్వేషించడంలో ఒక భాగమని వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బొల్ల వరప్రు జాన్‌వెస్లీ అన్నారు. అందుకే ఎవరికి నచ్చిన మతాన్ని వారు అనుసరిస్తారన్నారు. మారికవలస ఆర్‌జీకే కాలనీ లోని జీసస్ బ్లెస్సింగ్ చర్చి నిర్వాహకుడు, అంతర్జాతీయ సువార్త సేవకుడు రెవరెండ్ విజయ్ కిషోర్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కేక్ కట్ చేశారు. నిర్వాహకులు వెస్లీని ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో పాస్టర్లకు గత ప్రభుత్వం గౌరవ వేతనం ఇచ్చిందని తెలియజేశారు. వాసుదేవ్, కిషోర్, రాజారావు, సువార్త, రాజు, ఈశ్వరి, మత పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బౌద్ధారామాల్లో చారిత్రాత్మకంగా ఎంతో ప్రాధాన్యం ఉన్న పావురాల కొండపై నిర్లక్ష్యపునీడ అలముకుంది. భీమిలి పరిధిలోనే ఉన్న తొట్లకొండ, బావికొండను అభివృద్ధి చేసిన అధికారులు, పావురాలకొండపై దృష్టి సారించకపోవడంతో సరైన మార్గం కూడా లేక, చారిత్రకంగా ఎంతో ప్రాశస్త్యం ఉన్న ఈ ప్రాంత సందర్శనకు పర్యాటకుల అవకాశం లేకుండా పోయింది.



బౌద్ధులు నీటికోసం తవ్వుకున్న తటాకాలు

పావురాల కొండపై నిర్లక్ష్యపు నీడ

అభివృద్ధి జాడ లేని బౌద్ధారామం



కొండపై డచ్ వారు ఏర్పాటు చేసిన ఫ్లాగ్‌పోస్టు

భీమునిపట్నం: భీమిలి పరిధిలోని బౌద్ధారామాల్లో తొట్లకొండ, బావి కొండకన్నా ఎంతో చారిత్రాత్మక ప్రాధాన్యం కలిగి ఉన్నది పావురాల కొండ. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి, అందుబాటులోకి తేవాలని సందర్శకులు కోరుతున్నారు.

ఇదీ చారిత్రక నేపథ్యం

క్రీస్తు పూర్వం.. హీనయాన కాలంలో బౌద్ధ భిక్షువులు దేశ సంచారం చేస్తున్న కాలంలో ఈ ప్రాంతాల్లో కొంతకాలం ఉండి వెళ్లేవారు. ఇక్కడి బీచ్‌రోడ్డులోని తొట్ల కొండ, బావి కొండలతో పాటు భీమిలిని ఆనుకుని ఉన్న పావురాల కొండపైన తమ నివాసాలను, ప్రార్థన మందిరాలను, మంచినీటి తటాకాలను ఏర్పాటు చేసుకుని నివాసముండేవారు. నీటి కోసం తొట్లలాంటివి ఏర్పాటు చేసుకున్న కొండకు తొట్లకొండ అని, బావులను ఏర్పాటు చేసుకున్న కొండకు బావి కొండ అని.. అలాగే పావురాలను పెంచుకోవడంతో ఇక్కడి కొండకు పావురాల కొండ అని పేరు వచ్చినట్టు చెబుతారు. ఇందులో తొట్లకొండ, బావి కొండల ప్రాంతాలను ప్రభుత్వం గుర్తించి, 30 సంవత్సరాల క్రితం రోడ్లు వేయడంతో పాటు ఆ కొండలపై అభివృద్ధి పనులు నిర్వహించింది. దీంతో పర్యాటకులు అధిక సంఖ్యలో ఆ ప్రాంతాలను సందర్శిస్తున్నారు. కానీ, భీమిలిని ఆనుకుని ఉన్న పావురాల కొండపై మాత్రం ఎందుకో సీతకన్ను వేశారు. ఈ కొండ బౌద్ధులతో పాటు డచ్, బ్రిటిష్ చరిత్రలకు సాక్ష్యంగా ఉండటం గమనార్హం.

- దాదాపు 20 సంవత్సరాల క్రితం పురావస్తుశాఖ వారు ఈ కొండపై ఉన్న బౌద్ధుల నిర్మాణాలను, శిథిలమైన బ్రిటిష్ అతిథి గృహాన్ని బాగు చేయించి రంగులు వేశారు. అలాగే ఈ కొండ చుట్టూ కొంతమేర ఇనుప కంచె నిర్మించారు. ఇక తర్వాత, దీనిని ఎవరూ పట్టించుకోలేదు. తొట్లకొండ, బావి కొండలను అభివృద్ధి చేస్తున్నారు తప్ప పావురాలకొండను పూర్తిగా వదిలేశారు.

రాళ్లు తేలిన రోడ్డు

చారిత్రక, పౌరాణిక ఆధారాలెన్నో ఉన్న ఈ ప్రాంతంపై ప్రభుత్వం ఎందుకో దృష్టి సారించలేదు. దీంతో కనీసం ఈ కొండపైకి వెళ్లడానికి సరైన రోడ్డుమార్గం కూడా లేదు. ప్రస్తుతం కొండపైకి మట్టిరోడ్డు మాత్రం ఉండగా, అది కూడా రాళ్లు తేలి వెళ్లడానికి ఏమాత్రం అనుకూలంగా లేదు. దీని గురించి తెలిసిన వారిలో కొందరు పైకి నడిచి వెళ్లి వస్తుంటా రు. అయితే పురావస్తుశాఖ వారు సంవత్సరం క్రితం కొండ పైకి వచ్చే మార్గం వద్ద గేటును ఏర్పాటు చేసి, దానిని మూసేశారు. దీంతో నడిచి వెళ్లేవారు కూడా ఆ అవకాశం కోల్పోతున్నారు.



కొండపైకి రాళ్లు తేలిన మట్టిరోడ్డు

పౌరాణిక, చారిత్రక సాక్ష్యాలెన్నో..

పావురాల కొండకు చారిత్రక ఆధారాలతో పాటు పౌరాణికంగానూ ప్రాధాన్యం ఉంది. పంచపాండవులు అజ్ఞాత వాసంలో ఉన్న కాలంలో ఏకచక్రపురం అనే పేరుతో ఉన్న ఈ ఊరిలోనే కొంతకాలం ఉన్నట్టు చెబుతారు. ఆ సమయంలో బకాసురుడనే రాక్షసుడు ఈ కొండపై ఉండేవాడని, అతడిని భీముడు కొండపైకి వెళ్లి సంహరించడం వల్ల ఈ ఊరికి అప్పటి నుంచి భీమునిపట్నం అనే పేరు వచ్చిందని చెప్తారు.

- బౌద్ధులు ఉన్న అప్పటి నిర్మాణాలు, నీటి తటాకాలు ఉన్నాయి. తరువాత డచ్ వారు ఉండే సమయంలో తీరానికి వచ్చే ఓడలకు దిక్సూచిగా ఒక స్థూపంలాంటి ఫ్లాగ్‌పోస్టును ఏర్పాటు చేసి దానిపై జెండా ఎగరవేసేవారు. ఆ స్థూపం ఇప్పటికీ ఉంది. అలాగే బ్రిటిష్‌వారి సమయంలో నిర్మించిన అతిథి గృహం కూడా ఇప్పటికీ ఉంది. అయితే అభివృద్ధికి నోచుకోకపోవడంతో పాడుబడి ఉంది.



కొండపై బౌద్ధుల నివాసాల ఆనవాళ్లు

ప్రభుత్వం మారడంతో..

గత ప్రభుత్వ హయాంలో ఈ కొండపైకి రోడ్డు ఏర్పాటు చేయడంతో పాటు పైన ఆధునీకరణ పనులు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. కానీ, ప్రభుత్వం మారడంతో ఆ అవకాశం లేకుండా పోయింది. దీన్ని ఇలాగే వదిలేస్తే ఎంతో ప్రాధాన్యం గల ఈ కొండపై చరిత్రను తెలుసుకునే అవకాశం రానున్న రోజుల్లో ఎవరికీ లేకుండా పోతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సందర్శకులు కోరుతున్నారు.

ఎంతో ప్రత్యేకత గల ప్రాంతం



ఈ చుట్టుపక్కల ఉండే ఇతర ప్రాంతాలకన్నా పావురాల కొండకు ఎంతో ప్రత్యేకత ఉంది. ఇది పౌరాణిక, చారిత్రక ఘట్టాలకు ఆధారంగా ఉంది. కాని దీనిపైకి వెళ్లడానికి అవకాశం లేకపోవడం వెలితిగా ఉంది. సందర్శకులు కూడా వచ్చి, వెళ్లే దారి లేక నిరాశగా వెనుతిరుగుతున్నారు.

– డి. శ్రీనివాస్ భగవాన్లు, విశాఖ

వెళ్లే దారి లేదని ఎంతో నిరాశ చెందాను



నేను విశాఖకు తరచూ పర్యటనకు వస్తుంటాను. అప్పుడే ఈ కొండ గురించి తెలిసింది. భీముడు యుద్ధం చేసిన ప్రాంతం కూడా చూదామని ఎంతో ఆసక్తిగా అనిపించింది. కానీ వెళ్లే అవకాశం లేదని తెలిసి ఎంతో నిరాశ చెందాను. చారిత్రక ఆధారాలను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. నాలా ఎంతోమందికి ఈ కొండను చూసే అవకాశం కల్పించాలి. లేకుంటే చరిత్ర మరుగున పడిపోతుంది.

– అయ్యగారి వెంకట్ వకుల్, భిలాస్‌పూర్

కౌశల్ రాష్ట్ర స్థాయి పోటీలకు భీమిలి విద్యార్థులు

- పోస్టర్ ప్రెజెంటేషన్‌కు విజయదుర్గ
- క్విజ్ పోటీలకు మనోజ్ ఎంపిక



మనోజ్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం వెంకటరావు, ఉపాధ్యాయులు



విజయదుర్గను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తగరపువలస: భారతీయ విజ్ఞాన మండలి, ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ సంయుక్తంగా నిర్వహించిన జిల్లా స్థాయి కౌశల్–2024 పోటీల్లో భీమిలి జోన్ 3వ వార్డు రాయప్పాలెం జీవీఎంసీ హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థిని సరగడ విజయదుర్గ రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది. పోస్టర్ విభాగంలో ఈమె పోటీల్లో పాల్గొంది. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో విజయదుర్గతో పాటు గైడ్ టీచర్ శైలజను ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

మనోజ్‌కు అభినందన

భీమునిపట్నం: స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థి దాసరి మనోజ్ రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మనోజ్‌ను ప్రధానోపాధ్యాయుడు ఇమంది వెంకటరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రణాళికాబద్ధంగా సాగితే 'వికసిత్ భారత్' సాకారం

వీడీఎం–ఇండియా ఆన్ ది మూవ్ వ్యవస్థాపకులు ఆచార్య అజిత్



మాట్లాడుతున్న ఆచార్య అజిత్ కుమార్

మధురవాడ: అభివృద్ధికి మూల స్తంభాలైన రక్షణ, గ్రామీణ, వ్యవసాయ, ఆరోగ్య రంగాల్లో ప్రతి భారతీయుడు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తే మంచి ఫలితాలు సాధించగలమని వీడీఎం–ఇండియా ఆన్ ది మూవ్ వ్యవస్థాపకుడు, అంతర్జాతీయ మోటివేషనల్ స్పీకర్ ఆచార్య అజిత్ కుమార్ పేర్కొన్నారు. దేశంలోని ప్రజలంతా ప్రణాళికబద్ధంగా ఒకే సంకల్పంతో, ఒకే దిశలో అన్ని అడ్డంకులను అధిగమించి పయనిస్తే 2047 సంవత్సరం నాటికి భారత దేశం వికసిత్ భారత్‌గా రూపొందుతుందన్నారు. వికసిత్ భారత్–2047లో భాగంగా కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సీవోఈలో మంగళవారం ఆయన మాట్లాడారు. 2047 నాటికి భారత్ బలమైన భారత్‌గా రూపాంతరం చెందాలంటే అన్ని రంగాల్లో యువతను ప్రోత్సహిస్తూ వారికి అవకాశాలు కల్పించాలన్నారు. మహిళలకు రాజకీయ, సాంకేతిక రంగాలలో ప్రోత్సాహాన్ని కల్పించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో 10 ఉత్తమ వ్యాసాలు ఎంపిక చేసి, ప్రధాని మోదీ ఫొటోతో కూడిన ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రిన్సిపాల్ డి.శాంతకుమారి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డీసీవో రూపావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గేట్లు మూసి, డ్వాక్రా మహిళలను అడ్డుకుని..



మహిళలు వెళ్లకుండా మూసివేసిన గేటు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంటా

- జన సమీకరణకు తంటాలు
- 8వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కొమ్మాది: అధికార పార్టీ సభలకు జన సమీకరణ కోసం కిందిస్థాయి సిబ్బందికి తంటాలు తప్పడం లేదు. ఎండాడలోని ముబారక్ కాలనీ పార్కులో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు 8వ వార్డులో సుమారు రూ.6 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభ కోసం ఆర్పీలు డ్వాక్రా మహిళలను సమీకరించారు. అయితే శంకుస్థాపన అనంతరం మహిళలు బయటికి వెళ్లిపోయేందుకు ప్రయత్నించగా ఆర్పీలు గేట్లు మూసివేశారు. దీంతో డ్వాక్రా మహిళలు కాస్త అసహనానికి గురయ్యారు. గేట్లు వేసి తమను బంధించడం ఏమిటంటూ వారి ని నిలదీశారు. శంకుస్థాపనకు కార్పొరేటర్ లొడగల అప్పారావు, చెట్టిపల్లి గోపి, శాకర శ్రీనివాసరావు, బి.దొరబాబు, సుంకర హరిబాబు, అక్కరమాని రాంబాబు తదితరులు హాజరయ్యారు.

ఆనందపురం మండలంలో..

తగరపువలస: ఆనందపురం మండలంలో రూ.1.60 కోట్లతో చేపట్టనున్న రహదారుల మరమ్మతులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం భూమిపూజ చేశారు. త్వరలో ఆనందపురంలో అన్నా క్యాంటీన్ ప్రారంభిస్తామన్నారు. రామవరంలో రూ.87 లక్షలతో ఏర్పాటు చేసిన బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్‌ను ప్రారంభించారు. రామవరం, కణమాం, కోలవానిపాలెం, భీమన్నదొరపాలెం నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా భవిత కేంద్రాలు

పద్మనాభం: భవిత కేంద్రాలు దివ్యాంగులకు అండగా నిలుస్తున్నాయని ఎంఈవోలు పొన్నగంటి రమణ, ఎస్‌డీ బాబూలాల్ అన్నారు. వీటి సేవలను దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెడ్డిపల్లి భవిత కేంద్రంలో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. రెడ్డిపల్లి స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ సన్యాసిరావు,ఆర్పీలు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కె.కళావతి పాల్గొన్నారు.

ప్రమాదానికి గురైన బోటు పరిశీలన



బోటును పరిశీలిస్తున్న పర్యాటక శాఖ అధికారి జ్ఞానవేణి

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో తరచూ బోటు ప్రమాదాలు జరగడంపై జిల్లా పర్యాటకశాఖ అధికారి జ్ఞానవేణి అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రమాదాలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. సోమవారం నడిసంద్రంలో సంప్రదాయ మత్స్యకార బోటును ఏపీ టూరిజం స్పీడు బోటు ఢీ కొట్టిన సంఘటన తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం స్పీడ్ బోటును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రమాదానికి గల కారణాలు, బోట్లకు ఏమేర నష్టం వాటిల్లిందో సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి



నరసింగరావు(ఫైల్)

తగరపువలస: భీమిలి మండలం రాజాపులోవ–రాయ్‌పూర్ జాతీయ రహదారిపై జొన్నాడ టోల్‌ప్లాజా సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పిట్ట నరసింగరావు(35)అనే వ్యక్తి చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి కేజీహెచ్‌లో మృతి చెందాడు. వివరాలివి.. ఒకటో వార్డు కొత్తపేటకు చెందిన నరసింగరావు ద్విచక్రవాహనం పాడవడంతో మరమ్మతుల కోసం విజయనగరం వైపు తీసుకువెళ్లాడు. కొత్తపేటకే చెందిన అతని స్నేహితుడు సంతోష్‌కుమార్ ద్విచక్రవాహనం సాయంతో పాడైపోయిన ద్విచక్రవాహనాన్ని తీసుకువెళ్తున్నారు. అదే సమయంలో విజయనగరం జిల్లా డెంకాడ మండలం మోదవలస దాటిన తరువాత ఈ రెండు ద్విచక్ర వాహనాలను వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో నరసింగరావుకు తలపై, స్నేహితునికి చేతులు, కాళ్లపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం విజయనగరం మహారాజా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించగా, రాత్రి 11 గంటల సమయంలో నరసింగరావు మృతి చెందారు. మృతుని భార్య గౌరి ఫిర్యాదు మేరకు భీమిలి ఎస్‌ఐ ఎస్.గౌరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉత్తరాంధ్ర ఫుట్‌బాల్ టోర్నీ విజేత చిట్టివలస జట్టు



విజేత చిట్టివలస జట్టు

తగరపువలస: విజయనగరంలో ఈ నెల 5 నుంచి జరుగుతున్న బూర్లె రామారావు మెమోరియల్ ఉత్తరాంధ్ర ఫుట్‌బాల్ టోర్నీలో చిట్టివలస ఫుట్‌బాల్ జట్టు విజేతగా నిలిచింది. విశాఖకు చెందిన స్టార్ ప్లస్ ఫుట్‌బాల్ జట్టుపై 2 గోల్స్‌తో విజయం సాధించింది. క్రీడాకారులు అశోక్, గోపీ చెరో గోల్ సాధించారు. విజేత జట్టుకు ట్రోఫీ, వ్యక్తిగత పతకాలు అందించారు. క్రీడాకారులను జట్టు కార్యదర్శి అక్కరమాని చినబాబు, కోచ్ బోర చిన్నారెడ్డి, మేనేజర్ మంతిన రాంజీ, ప్రతినిధులు అభినందించారు.

ఘనంగా బంగారమ్మ ఉత్సవం



గ్రామంలో అమ్మవారి సారె ఊరేగింపు

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లిలో బంగారమ్మ ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు అమ్మవారి సారె ఊరేగింపు నిర్వహించారు. పుష్పాల వీధిలో ఉన్న అమ్మవారి ఆలయం నుంచి గ్రామంలోని వీధుల్లో ఊరేగింపు సాగింది. మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి, మొక్కులు చెల్లించారు. కోలాటం, పులివేషాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

బెటాలియన్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న మురళీకృష్ణ

పీఎం పాలెం: బెటాలియన్‌లో పనిచేస్తున్న అన్ని హోదాల ఉద్యోగుల వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటున్నామని బక్కన్నపాలెం ఏపీఎస్‌పీ 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ అన్నారు. బెటాలియన్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన దర్బారులో ఆయన ప్రసంగించారు. బెటాలియన్‌లో ఉద్యోగుల పిల్లల స్కూల్ ఫీజుల్లో రాయితీపై వివిధ పాఠశాలల యాజమాన్యాలతో సంప్రదించామన్నారు. స్కూల్ బస్ ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్లు పి.సత్యం మురళీధర్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు రక్షించండి

మధురవాడ రెవెన్యూ సదస్సులో వినతులు



శ్మశానవాటిక స్థలాన్ని పరిరక్షించాలని వినతి పత్రం అందజేస్తున్న గ్రామ పెద్దలు

మధురవాడ: విశాఖ రూరల్ మండలం మధురవాడ రెవెన్యూ గ్రామంలో ప్రభుత్వ భూముల రక్షణకు చర్యలు చేపట్టాలని పలువురు వినతిపత్రాలు ఇచ్చారు. వాంబే కాలనీలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ పాల్‌కిరణ్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 6వ వార్డు రేవళ్లపాలెంలో శ్మశాన వాటికకు కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమణకు యత్నిస్తున్నారని, రక్షణకు చర్యలు చేపట్టాలని రేవళ్లపాలెం శ్రీ బంగారమ్మ, శ్రీ భూలోకమాత సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు పోతిన శ్రీనివాసరావు, పిళ్లా రమణ తదితరులు ఫిర్యాదు ఇచ్చారు. షిప్‌యార్డ్ లే అవుట్‌లో ప్రభుత్వ పార్కు స్థలంలో ఆక్రమణలు తొలగించాలని ఫిర్యాదు చేశారు. సదస్సులో 42 ఫిర్యాదులు అందాయి. డీటీ రాజేష్, ఎండోమెంట్ ఈవో రాజగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాండ్రంగిలో..

పద్మనాభం: పాండ్రంగిలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 54 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో మ్యుటేషన్ కొరకు 31 మంది, ఎఫ్ లైన్‌కు 14 మంది దరఖాస్తు చేసుకున్నారు. తహసీల్దార్ కె.ఆనందరావు ఈ దరఖాస్తులను స్వీకరించారు. సదస్సును ప్రత్యేక అధికారి ఎస్.సుధా సాగర్ సందర్శించి రెవెన్యూ రికార్డులను పరిశీలించారు.

విద్యార్థినుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి

పద్మనాభం: విద్యార్థినుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని విద్యాశాఖ ఆర్జేడీ విజయ్ భాస్కర్ సూచించారు. పద్మనాభం కస్తూర్బా విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. సీఆర్టీలు, పదో తరగతి విద్యార్థినులతో ఆయన మాట్లాడారు. టెస్ట్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు కార్యాచరణ రూపకల్పనపై విద్యార్థినులకు మార్గనిర్దేశం చేశారు. మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న తీరు, వంటకాల రుచి చూశారు. సమావేశంలో సమగ్ర శిక్షా అభియాన్ జీసీడీవో కాలేషా బేగం, ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి కల్యాణమండపంలో పంచాయతీ వాసులకు పీఎం సూర్యఘర్ సోలార్ పథకం గురించి మంగళవారం అవగాహన కల్పించారు. పథకం వినియోగానికి అనుసరించవలసిన విధానం, సబ్సిడీ, ప్రోత్సాహకాల గురించి తెలియజేశారు. జిల్లా పంచాయతీ అధికారి ఎం.వి.ఎ.శ్రీనివాసరావు, సర్పంచ్ లక్ష్మణరావు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ శ్యాంబాబు, ఈఈ శ్రీనివాసరావు, డీఈఈ రాజశేఖర్, పంచాయతీ విస్తరణ అధికారి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు పి.అప్పలనాయుడు పాల్గొన్నారు.